మొదటి పేజీ తరువాయి

# పాక్ ఉగ్రస్థావరాల పై భీకరదాడులు




పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటాక మెరుపు దాడులు చేసింది. అంతర్జాతీయ ఉగ్రవాదులు మౌలానా మసూద్ అజర్ సారథ్యంలోని జైషే మహ్మద్, హాఫీజ్ సయీద్ నేతృత్వంలోని లష్కరే తొయిబాతో పాటు హిజ్బుల్ ముజాహిదీన్ తదితర ఉగ్ర తండాల వెన్ను విరిచింది. వాటి ప్రధాన స్థావరాలతో పాటు శిక్షణ శిబిరాలను కూడా నేలమట్టం చేసేసింది. 'ఆపరేషన్ సిందూర్' పేరిట 25 నిమిషాల దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. త్రివిధ దళాలు పూర్తి సమన్వయంతో, అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ నిర్వహించాయి. ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్‌తో వైమానిక దళం, సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణులతో ఆర్మీ ద్విముఖ వ్యూహంతో ఏక కాలంలో దాడులకు దిగాయి. అత్యాధునిక స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హామర్ ప్రెసిషన్ బాంబులు, గైడెడ్ బాంబ్ కిట్లు, ఆత్మాహుతి డ్రోన్లతో 9 ఉగ్రవాద శిబిరాలను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టేశాయి. వీటిలో ఐదు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండగా నాలుగు స్వయానా పాక్ గడ్డ మీదే ఉండటం విశేషం! బాలాకోట్ దాడుల మాదిరిగా పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మన ఎయిర్‌ఫోర్స్ అమ్ములపొదిలోని అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాలు సరిహద్దులకు ఇవతలి నుంచే అరగంట లోపే పని ముగించేశాయి. అర్ధరాత్రి 1:05కు మొదలైన దాడులు 1:30కు ముగిశాయి. ఆ వెంటనే 1:44 గంటలకు రక్షణ శాఖ ప్రకటన విడుదల చేసింది. ''కాసేపటి క్రితం ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. పాక్, పీఓకేల్లో నుంచి భారత్‌పై ఉగ్ర దాడులకు వ్యూహరచన చేసిన ఉగ్రవాద మౌలిక వ్యవస్థలపై దాడులు చేశాం. ఉద్రిక్తతలకు తావులేని రీతిలో, పూర్తి కచ్చితత్వంతో కేవలం ఉగ్ర శిబిరాలను మాత్రమే ధ్వంసం చేశాం. పాక్ సైన్యాన్ని, సైనిక వ్యవస్థలను, పౌరులను ఏ మాత్రమూ లక్ష్యం చేసుకోలేదు. లక్ష్యాల ఎంపిక, దాడిలో ఆ మేరకు పూర్తి సంయమనం పాటించాం'' అని వెల్లడించింది. ''ఈ రోజు మనం చరిత్ర సృష్టించాం. భారత్ మాతా కీ జై'' అంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ''పహల్గాం బాధితులకు న్యాయం జరిగింది. జైహింద్'' అని సైన్యం పేర్కొంది. దాడుల వీడియోను ఎక్స్‌లో ఉంచింది. మృతుల్లో జైషే చీఫ్ అజర్ కుటుంబానికి చెందిన 10 మంది ఉన్నారు. దీన్ని అజర్ కూడా ధ్రువీకరించాడు. జైషే ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడుల్లో వారితో పాటు తన నలుగురు సన్నిహిత సహచరులు కూడా మరణించినట్టు చెప్పుకొచ్చాడు. పాక్ ప్రేరేపిత ఉగ్ర తండాల పీచమణచేలా అద్భుతంగా సాగిన సైనిక చర్య భారతీయులందరికీ గర్వకారణమంటూ ప్రధాని మోదీ ప్రస్తుతించారు. భారత దాడుల్లో 26 మందే మరణించారని, 46 మందికి పైగా గాయపడ్డారని పాక్ చెప్పుకుంది. సరైన సమయంలో ప్రతీకారం తీర్చుకుంటామంటూ తొలుత ప్రగల్భాలకు దిగినా కాసేపటికే దిగొచ్చింది. గట్టి ప్రతిచర్యలు తప్పవంటూ బీరాలు పలికిన రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, 'ఇప్పటికైనా ఉద్రిక్తతలు పెరగకుండా భారత్ చూస్తే మేమూ సహకరిస్తాం' అంటూ సాయంత్రానికల్లా మాట మార్చారు. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో బైసారన్ మైదానంలో 26 మంది పర్యాటకులను లష్కరే ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చి చంపడం తెలిసిందే.

### అద్భుత నైపుణ్యం
### దాడులపై నిపుణులు

సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను అమలు చేసిన తీరును రక్షణ నిపుణులు ఎంతగానో కొనియాడుతున్నారు. ఉగ్ర శిబిరాల పరిసరాల్లోని నివాసాలు తదితరాలకు ఏమాత్రమూ నష్టం జరగకుండా, కేవలం లక్ష్యాలను మాత్రమే నేలమట్టం చేస్తూ అత్యంత కచ్చితత్వంతో దాడులు జరపడం అద్భుతమని చెబుతున్నారు. ''పాక్ సైనిక స్థావరాలు, కీలక మౌలిక వ్యవస్థల వంటివాటి జోలికే వెళ్లకుండా సంయమనం పాటించడం నిస్సందేహంగా అద్భుతమైన దౌత్య ఎత్తుగడే. తద్వారా ప్రతీకార దాడులకు దిగేందుకు పాక్‌కు ఎలాంటి సాకూ లేకుండా పోయింది. పైగా 9 ఉగ్ర శిబిరాల్లో 4 స్వయానా పాక్ భూభాగంలోనే ఉండటంతో ఆ తండాలను దాయాది ఇప్పటికీ పెంచి పోషిస్తోందని నిర్ద్వంద్వంగా నిరూపణ అయింది. దాంతో పాక్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. అంతర్జాతీయ సమాజం ముందు మరోసారి ధూర్త దేశంగా మిగిలింది'' అని వారు వివరించారు. దాడులు చేసిన ప్రాంతాల్లో కొన్ని సరిహద్దుల నుంచి ఏకంగా 100 కి.మీ. లోపల ఉండటం విశేషం. తద్వారా పాక్‌లో ఏ లక్ష్యాన్నైనా, ఎప్పుడైనా అత్యంత కచ్చితత్వంతో ఛేదించే సత్తా తనకుందని భారత్‌కు మరోసారి నిరూపించింది. 25 నిమిషాలు.. 9 లక్ష్యాలు దాడుల విషయంలో సైన్యం అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించింది. పక్కాగా వ్యవహరించి అత్యంత విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించింది. నిఘా వర్గాలు పక్షం రోజుల పాటు నిరంతరాయంగా శ్రమించి లష్కరే, జైషే తదితర ఉగ్రవాద సంస్థ శిబిరాలతో పాటు ప్రధాన కార్యాలయాల ఆనుపానులను పక్కాగా సేకరించాయి. వాటి ఆధారంగా ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగాయి. సరిహద్దులకు ఆవల క్షిపణి నిరోధక వ్యవస్థలు తదితరాలతో కాచుకుని కూచున్న శత్రు సైన్యం అంచనాలకు అందకుండా వ్యవహరించాయి. సరిహద్దులు దాటకుండానే ఆపరేషన్ నిర్వహించాయి. మురిద్కే, బహావల్‌పూర్‌ల్లోని లష్కరే, జైషే ప్రధాన స్థావరాల్లో ఒక్కోచోట కనీసం 30 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు.

మొదటి పేజీ తరువాయి

# ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం

ఈ సమయంలో రాజకీయాలకు, పార్టీలకు తావు లేదు. మంత్రులు, అధికారులు, ఉద్యోగులందరూ అందుబాటులో ఉండాలి. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలి. అత్యవసర సర్వీస్‌లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేయండి. మీడియా, సోషల్ మీడియాలో ప్రభుత్వ ఉద్యోగులు అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు చేపట్టండి'' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దేశ రక్షణలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతంగా, డిఫెన్స్ విభాగాలకు స్థావరంగా ఉన్నందున.. తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అన్ని విభాగాలకు దిశానిర్దేశం చేశారు. మాక్ డ్రిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ''ఎవరూ భయభ్రాంతులకు గురికావద్దు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా అనుమానాలుంటే వెంటనే పోలీసు విభాగానికి ఫిర్యాదు చేయండి. వైద్యం, పౌరసరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవలు అందించే విభాగాలు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబరు ఇవ్వాలి. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా వచ్చి నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోండి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించండి. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు సిద్ధం చేసుకోవాలి. సైబర్ సెక్యూరిటీ విభాగం అప్రమత్తత చాలా ముఖ్యం. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ పెట్టండి ఫేక్ న్యూస్, వదంతులు ప్రచారం చేసే వారిపైన ఉక్కుపాదం మోపండి. వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలి. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయండి. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు.. సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. ఆయా ప్రాంతాల్లో భద్రతను పెంచాలి'' అని ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన సీఎం... బయట ఎండలో ఉన్న పాత్రికేయులను చూసి కాన్వాయ్‌ను ఆపారు. జర్నలిస్టులతో కాసేపు మాట్లాడారు. ''ఆపరేషన్ సిందూర్‌ను చూసి ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. ప్రతి భారతీయుడు ఆర్మీకి బాసటగా నిలవాలి. సీఎంగా నా బాధ్యత నిర్వర్తిస్తున్నా. రాజకీయాలు కాదు.. దేశం ముందు. దేశంలోకి వచ్చి చంపుతుంటే చూస్తూ ఊరుకుంటే ఎలా? అన్ని విభాగాలను అప్రమత్తం చేశాం'' అని వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, ఇతర పోలీసు, స్థానిక మిలిటరీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకూ జరగనున్న ఈ ర్యాలీలో సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు, పలువురు నేతలు పాల్గొంటారు. సైన్యానికి మద్దతుగా ఈ ర్యాలీలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి అత్యవసరంగా రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అధిష్ఠానం పిలుపు మేరకు ఢిల్లీకి వెళ్లాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన.. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రద్దయింది. అంతకుముందే ఢిల్లీ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సీఎం ఫోన్ చేశారు. తక్షణం బయలుదేరి హైదరాబాద్ రావాల్సిందిగా సూచించారు. దీంతో బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్, మాక్ డ్రిల్ తదితర పరిస్థితులపై వారిద్దరూ చర్చించారు. చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. ''హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆర్మీ, నేవీ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. రక్షణ రంగానికి చెందిన సంస్థల దగ్గర భద్రతాపరమైన చర్యలు చాలా ముఖ్యం. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేయండి. తెలంగాణ పర్యటనకు వచ్చిన విదేశీ పర్యాటకులకు తగిన రక్షణ కల్పించాలి. కేంద్ర నిఘా బృందాలతో రాష్ట్ర నిఘా బృందాలు సమన్వయం చేసుకోవాలి'' అని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. పౌరుడిగా సాయుధ దళాలకు అండగా నిలుస్తున్నా: సీఎం ఆపరేషన్ సిందూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈ అంశంపై 'ఎక్స్'లో స్పందించారు. ''పాక్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయి. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా, సంఘీభావంగా, ఐక్యంగా నిలబడాలి. ఒక భారతీయ పౌరుడిగా నేను ముందుగా మన సాయుధ దళాలకు బలంగా... అండగా నిలుస్తున్నా. ఉగ్రవాద నిర్మూలన కోసం భారత సైన్యం చేపట్టిన ఈ ధైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనం. మనమంతా ఒకే గొంతుకై, ఒకే స్వరంతో ప్రకటిద్దాం. జై హింద్!'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఆపరేషన్ సిందూర్.. ఈ 9 స్థావరాల్లోనే ఎందుకు దాడులు జరిపింది?




### ఈ 9 స్థావరాల్లోనే ఎందుకు దాడులు జరిపింది?

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడికి భారత్ సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. భారత త్రివిధ దళాలు సంయుక్తంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని 9 ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు చేశాయి. లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలు వినియోగిస్తున్న రవాణా, కార్యకలాపాలు, శిక్షణకు సంబంధించిన కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా భారత్ ఈ దాడులకు దిగింది. అంతేకాదు, భారత్ సైన్యం టార్గెట్ చేసిన 9 స్థావరాలు గతంలో భారత్‌పై ఉగ్రదాడులు, చొరబాట్ల యత్నాలకు పాల్పడిన చరిత్ర కలిగి ఉన్నాయి. పాకిస్థాన్‌లోని దక్షిణ పంజాబ్‌లో ఉన్న బహవల్పూర్ ప్రాంతం భారతదేశ మోస్ట్ వాంటెడ్ పాకిస్తాన్ ఉగ్రవాది మసూద్ అజార్ నేతృత్వంలోని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు ప్రధాన కేంద్రంగా పేరుగాంచింది. 2001 పార్లమెంట్ దాడి, 2019 పుల్వామా ఆత్మాహుతి దాడి వంటి అనేక దాడులకు ఈ సంస్థ సంబంధం కలిగి ఉంది. అంతేకాదు, బహవల్‌పూర్‌లో ఉగ్రవాద సంస్థకు నాలుగు శిక్షణా కేంద్రాలు ఉన్నాయని సమాచారం. అందుకే భారత సైన్యం ప్రధానం టార్గెట్‌గా ఈ స్థావరాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. లాహోర్‌కు సుమారు 40 కిలోమీటర్ల ఉత్తరాన ఉన్న మురిద్కే, లష్కరే తోయిబా, దాని సేవా విభాగం జమాత్‌ఉద్‌దవాకు చాలా కాలంగా కీలక స్థావరంగా ఉంది. 200 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న ఈ ఉగ్రవాద కేంద్రంలో శిక్షణ ప్రాంతాలు, భావజాల వ్యాప్తి కేంద్రాలు, రవాణా సదుపాయాలు ఉన్నాయి. 2008 ముంబై దాడుల వెనుక లష్కరే తోయిబా హస్తం ఉందని భారత్ ఆరోపిస్తోంది. 26/11 దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు ఇక్కడే శిక్షణ పొందారని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇక్కడ భారత సైన్యం దాడులు జరిపింది. భారత సైన్యం టార్గెట్ చేసిన మరో ప్రాంతం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని కోట్లి. ఈ ప్రాంతం ఆత్మాహుతి బాంబర్లు, తిరుగుబాటుదారులకు ప్రధాన శిక్షణ కేంద్రంగా ఉంది. అధికార వర్గాల కథనం ప్రకారం.. కోట్లి కేంద్రంలో ఒకేసారి 50 మందికి పైగా శిక్షణ పొందే సామర్థ్యం ఉంది. ఇక జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి, పూంచ్ ప్రాంతాలలో కార్యకలాపాల కోసం 2023, 2024లో గుల్పూర్‌ను పదేపదే ఫార్వర్డ్ లాంచ్‌ప్యాడ్‌గా ఉపయోగించినట్లు భావిస్తున్నారు. ఈ ప్రాంతాలలో భారత భద్రతా బలగాల కాన్వాయ్‌లు, పౌర లక్ష్యాలపై దాడులు చేసిన ఉగ్రవాదులకు ఈ ప్రదేశం ఒక వేదికగా ఉపయోగపడిందని సమాచారం. సియాల్‌కోట్ సమీపంలోని మెహమూనా శిబిరాన్ని కశ్మీర్‌లో చారిత్రాత్మకంగా చురుకుగా ఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థ ఉపయోగించుకుంది. ఇటీవలి సంవత్సరాలలో ఈ బృందం క్షీణించినప్పటికీ, సరిహద్దు మీదుగా, ముఖ్యంగా స్థానిక మద్దతు నెట్‌వర్క్‌లు చెక్కుచెదరకుండా ఉన్న మెహమూనా వంటి ప్రాంతాల నుంచి మిగిలిన వారికి శిక్షణ ఇస్తున్నారని భారత అధికారులు చెబుతున్నారు. ఉత్తర కశ్మీర్‌లోని సోన్‌మార్గ్, గుల్‌మార్గ్, పహల్గామ్ ప్రాంతాలలో జరిగిన దాడులతో సవాయ్‌కి సంబంధం ఉన్నట్లు భారత్ సైన్యం గుర్తించింది. అందుకే ఈ ప్రాంతంలో దాడులు జరిపింది. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న సర్జల్, బర్నాలా చొరబాటుకు కీలక మార్గాలుగా పరిగణించబడుతున్నాయి. కాగా, 1971 యుద్ధం తర్వాత పాకిస్థాన్ భూభాగంలో భారత్ చేపట్టిన మొదటి ఆపరేషన్ ఇది. పాకిస్తాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని భారత్ ఇప్పటికే ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, ఈ ఆపరేషన్ తర్వాత, భారతదేశం ప్రధాన ప్రపంచదేశాలతో దౌత్య సంబంధాలను ప్రారంభించింది.

మొదటి పేజీ తరువాయి

## సైనిక బలగాలకు కాంగ్రెస్ పూర్తి మద్దతు: మల్లికార్జున ఖర్గే



అనంతరం పార్టీ నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సాహసోపేత నిర్ణయం తీసుకున్న భారత సాయుధ దళాలను చూసి తాము గర్విస్తున్నామని మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడడానికి అన్ని స్థాయిల్లో ఐక్యంగా ఉండాలన్నారు. దేశ రక్షణ, ఐక్యత, స్వేచ్ఛను కాపాడటానికి తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నామని వెల్లడించారు. సాయుధ దళాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని రాహుల్ గాంధీ కూడా ప్రకటించారు.

### రేపు అఖిలపక్ష సమావేశం

ఉగ్ర స్థావరాలపై దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో ఈ సమావేశం జరగనుంది. పహల్గాం దాడి అనంతరం ఏప్రిల్ 24న కూడా కేంద్రం అఖిలపక్ష భేటీ నిర్వహించింది.

మొదటి పేజీ తరువాయి


## మా పౌరులను చంపిన వారినే అంత మొందించాం.. రాజ్‌నాథ్ సింగ్



వ్యవహరించాయని, నిర్దేశించిన లక్ష్యాలను సరైన టైంలో ధ్వంసం చేశారని తెలిపారు. సైన్యం దేశం మొత్తాన్ని గర్వపడేలా చేసిందని కొనియాడారు. 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ చేపట్టిన 50 మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా రాజ్ నాథ్ ప్రసంగించారు. ఆపరేషన్ విజయవంతం చేసిన సాయుధ బలగాలకు కృతజ్ఞతలు తెలిపారు.
మా భూమిపై జరిగిన దాడికి ప్రతిస్పందించే హక్కును భారత్ ఉపయోగించుకుందని నొక్కి చెప్పారు. ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చే శిబిరాలను నాశనం చేశామని, అమాయక పౌరులను టార్గెట్ చేయలేదన్నారు. ఉగ్రవాదుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే లక్ష్యంతో వారి శిబిరాలు, మౌలిక సదుపాయాలకే పరిమితం చేశామన్నారు. సైన్యానికి పూర్తి మద్దతు అందించిన ప్రధాని మోడీకి అభినందనలు తెలిపారు. అశోక్ వాటికను నాశనం చేసేటప్పుడు హనుమంతుడి ఆదర్శాన్ని తాము అనుసరించామన్నారు. ఎంతో ఆచరణతో పక్కాగా ఆపరేషన్ చేశామన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఆపరేషన్ సిందూర్'పై పాకిస్థాన్ ప్రధాని ఏమన్నారంటే!



గత రాత్రి తమ దేశంపై జరిగిన దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. జాతినుద్దేశించి ప్రసంగించిన ఆయన.. దీటుగా సమాధానం ఎలా ఇవ్వాలో తమ దేశానికి, తమ బలగాలకు తెలుసునన్నారు. పాక్ సాయుధ దళాలకు దేశం మొత్తం అండగా నిలుస్తుందన్నారు. ''మనం వెనక్కి తగ్గుతున్నామని వారు (భారత్) అనుకుంటున్నారని, కానీ, ఇది ధైర్యవంతుల దేశమని వారు మరచిపోయారు'' అని వ్యాఖ్యానించారు.
మరోవైపు ఉగ్రస్థావరాలపై భారత సైనిక చర్య నేపథ్యంలో పాకిస్థాన్ అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించింది. అన్ని ఆసుపత్రుల సిబ్బంది అత్యవసర విధుల్లో ఉండాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా 48 గంటలపాటు గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, బుధవారం సాయంత్రానికి ప్రధాన మార్గాల్లో విమాన రాకపోకలను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించింది. ఇస్లామాబాద్, పంజాబ్‌లలో విద్యాసంస్థలు మూసివేసింది. దేశవ్యాప్తంగా భద్రతా బలగాలను సిద్ధంగా ఉంచింది. ఇక భారత్ జరిపిన దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారని, 46 మందికి గాయాలయ్యాయని పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్ డైరెక్టర్ జనరల్ వెల్లడించారు.

# భారత్, పాక్‌లు దాడులను ఆపేయాలి: ఇరు దేశాలకు ట్రంప్ ఆఫర్



**భారత్, పాక్‌లు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని ట్రంప్ తాజాగా సూచించారు. ఇరు దేశాలు తమ విభేదాలు పరిష్కరించుకోవడానికి సహాయం చేస్తానని పేర్కొన్నారు.**

ఈ కబురు,వాషింగ్టన్: పాక్ ఉగ్రస్థావరాలపై భారత్ మంగళవారం అర్ధరాత్రి దాటాక మెరుపు దాడులతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీంతో పలువురు దేశాధినేతలు, రాయబారులు దాడుల ఘటనపై స్పందించారు. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని భారత్, పాక్‌లను కోరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా స్పందించారు. ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఇరు దేశాలు ఒకరిపైఒకరు దాడులు చేయడం ఆపాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు దేశాలకు ట్రంప్ ఆఫర్ ఇచ్చారు. ఇరు దేశాలు తమ విభేదాలు పరిష్కరించుకోవడానికి తాను సహాయం చేస్తానని పేర్కొన్నారు. ''భారత్, పాక్‌ల మధ్య పరిస్థితి చాలా భయంకరంగా ఉంది. రెండు దేశాల గురించి నాకు చాలా తెలుసు. వాటితో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, వాటిని ఆపేయాలని కోరుకుంటున్నాను. వారు అనుకుంటే ఇప్పుడే చేసేయగలరు. రెండు దేశాలు కయ్యానికి కాలు దువ్వాయి. అమెరికాతో భారత్, పాక్‌కు మంచి సంబంధాల దృష్ట్యా వారికి సహాయం చేయాల్సి వస్తే నేను అందుబాటులో ఉంటాను. ఏ సహాయమైనా చేస్తాను'' అని ట్రంప్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి బదులుగా పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై ఇండయన్ ఆర్మీ దాడులు చేయడంతో సుమారు 70 మందికి పైగానే టెర్రరిస్టులు చనిపోయినట్లు సమాచారం. అయితే భారత్ జరిపిన దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారని, 46 మందికి గాయాలయ్యాయని పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్ డైరెక్టర్ జనరల్ వెల్లడించారు. ఇక భారత దాడులతో సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట పాక్ బలగాలు కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించి షెల్లింగ్, కాల్పులతో దాడులు తీవ్రతరం చేసింది. దీంతో 15 మంది భారత పౌరులు మృతి చెందగా, ఒక జవాను అమరుడయ్యాడు. 43 మంది పౌరులు గాయపడ్డారు

## ఇక భారత్‌పై ఏమాత్రం జాలి చూపను.. మసూద్ అజార్ సంచలన లేఖ విడుదల



ఈ కబురు: 'ఆపరేషన్ సిందూర్' లో భాగంగా బవహల్పూర్ లోని జైష్‌ఎమహమ్మద్ ప్రధాన స్థావరం అయిన సుభాన్ అల్లా కాంప్లెక్స్‌పై ఇండియన్ ఆర్మీ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో జైష్‌ఎమహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబానికి చెందిన మొత్తం 14 మంది కుటుంబ సభ్యులు హతమయ్యారు. అందులో అతడి అక్క, బావ, మేనల్లుడు, భార్య కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోడీ పై విషం కక్కుతూ.. మసూద్ అజార్ తాజాగా ఓ సంచలన లేఖ విడుదల చేశాడు. అందులో తాను కూడా చనిపోయి ఉంటే బాగుండేదని మసూద్ అజార్ ప్రస్తావించాడు. ప్రధాని మోడీ కశ్మీర్ విషయంలో అన్ని నియమాలను ఉల్లంఘించారని ఆక్రోశం వెల్లగక్కారు. భారత్‌పై తప్పక ప్రతీకారం తీర్చుకుంటామని తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశాడు. ఇండియాపై ఏమాత్రం జాలి చూపబోమని బీరాలు పలికాడు. భయం లేదు.. నిరాశ లేదు.. దుఃఖం లేదంటూ చనిపోయాడని అనుకున్న మసూద్ అజార్ రాసిన లేఖ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

## అతుల్ జైన్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ



ఈ కబురు,ఢిల్లీః కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్ జైన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మేడిగడ్డ, సమ్మక్క, సారక్క, పాలమూరురంగా రెడ్డి ప్రాజెక్టులపై చర్చించారు.మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించారు. అదే సమయంలో సమ్మక్క, సారక్క, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల అంశాన్ని సైతం భేటీలో ప్రస్తావించారు. కృష్ణానది పై పలు చోట్ల టెలిమెట్రి పరికరాలు ఏర్పాటు అంశాన్ని కూడా చర్చించారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ. 'మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మేడిగడ్డ డిజైన్ ,. ఆపరేషన్ లోపాలు ఉన్నాయని ఎన్ డి ఎస్ ఏ నివేదిక స్పష్టం చేసింది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రాజెక్ట్ పునరుద్ధరణ ఎలా చేయాలని మార్గాలు అన్వేషిస్తున్నాం. డీపీఆర్‌లో చూపెట్టిన స్థలం వేరు. ఒక ప్రాంతంలో కడతామని మరో ప్రాంతంలో మేడిగడ్డ కట్టారు. మేడిగడ్డ , సుందిళ్ల బ్యారేజ్ ల విషయంలో సిడబ్ల్యుసి సంప్రదింపులతో ముందుకు వెళ్లాలని ఎన్డీఎస్సీ సూచించింది. పాడైపోయిన మేడిగడ్డ , సుందిళ్ల బ్యారేజ్ లను ఎలా ముందుకెళ్లాలనిపై చర్చించా. తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్టు కడతాం. సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టిఎంసిల నీటి కేటాయింపులు వేగంగా జరపాలని కోరా. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకి 90 టీఎంసీలు కోరుతున్నాం. వాటిలో తక్షణమే 45 టీఎంసీలు కేటాయించాలని విజ్ఞప్తి చేశాను. అక్రమ నీటి తరలింపుకు చెక్ పెట్టేందుకు టెలిమెట్రీ పెట్టాలని కోరాం. పోలవరం బ్యాక్ వాటర్ తో ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది. దానికి రిటెన్షన్ వాల్ ను నిర్మించాలని అడిగాం' అని ఉత్తమ్ తెలిపారు.

# ప్రతిదాడులకు ఆస్కారం లేకుండా దాడి చేశాం




తమ భూభాగంలో ఉగ్ర వ్యవస్థపై పాకిస్తాన్ ఎలాంటి చర్యలు తీసుకోని కారణంగా మేం 'బాధ్యతాయుతమైన' దాడులు చేశాం. పహల్గాం ఉదంతం తర్వాత సైతం మరోసారి భారత్‌లో దాడులతో తెగించేందుకు ఉగ్రసంస్థలు కుట్రలు పన్నినట్లు విశ్వసనీయ నిఘా సమాచారం అందటంతో ముందస్తుగా మెరుపుదాడులు చేశాం. పౌర, జనావాసాలకు ఏమాత్రం హాని కలగకుండా కేవలం ఉగ్రవాదుల మౌలికవసతులే లక్ష్యంగా దాడులు జరిపాం. సీమాంతర దాడులు, సీమాంతర చొరబాట్లను నిరోధించడమే లక్ష్యంగా మంగళవారం అర్ధరాత్రి దాడులు కొనసాగాయి. బైసారన్‌లో హేయమైన ఉగ్రదాడి జరిగింది. అమాయకులను తమ కుటుంబసభ్యుల కళ్లెదుటే తలపై గురిపెట్టి కాల్చిచంపారు. దీంతో కుటుంసభ్యుల్లో అంతులేని విషాదం, భయం అలుముకున్నాయి.

భారత్ అదే స్థాయిలో ఉగ్రవాదులకు దీటైన సమాధానం చెప్పదల్చుకుంది'' అని మిస్రీ స్పష్టం చేశారు. ''జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనడం ఇష్టంలేకే ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. కోట్ల మంది పర్యాటకులతో వృద్ధిబాటలో పయనిస్తున్న కశ్మీర్ ఆర్థికవ్యవస్థను ఉగ్రవాదులు కూలదోయాలనున్నారు. ప్రత్యేకంగా హిందువులను చంపేసి కశ్మీర్ లోయలో, దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టాలని చూశారు. కానీ భారతీయులు వీళ్ల నమ్మకాన్ని వమ్ముచేశారు. ఈ విషయంలో మన ప్రజలను కచ్చితంగా మెచ్చుకోవాల్సిందే'' అని మిస్రీ అన్నారు.

నారీశక్తి.. నాయకత్వం

'ఆపరేషన్ సిందూర్' దాడి వివరాలను ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఇద్దరు మహిళా అధికారులు మీడియాకు వివరించడం అక్కడి వారందర్నీ ఆశ్చర్యపరిచింది. భారత్ ఏఏ ప్రాంతాలపై దాడి చేసిందనే పూర్తి వివరాలను భారత ఆర్మీ తరఫున కల్నల్ సోఫియా ఖురేషి, భారత వాయుసేన తరఫున వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు మీడియాకు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే), పాకిస్తాన్‌లోని ఏఏ ప్రాంతాల్లో ఏ విధంగా భారత్ దాడులు చేసిందో ఈ అధికారిణులు ఇద్దరూ సవివరంగా చెప్పారు.

ధైర్యసాహసాలతో దాడులు చేసిన వైనాన్ని వనితలతో చెప్పించడం వెనుక భారత సర్కార్ దౌత్య పాటవం దాగి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. లింగవివక్షకు తావులేకుండా కీలక సమయాల్లోనూ భారత్ సమానత్వానికి, మహిళా సాధికారతకు జై కొడుతుందని ఈ మీడియా సమావేశంలో భారత్ మరోసారి చాటిచెప్పిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. సోఫియా ఖురేషి ప్రస్తుతం ఆర్మీ కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌లో కల్నల్‌గా ఉన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా ప్రస్తుతం హెలికాప్టర్ పైలట్‌గా సేవలందిస్తున్నారు. ఖురేషీ హిందీలో, వ్యోమికా ఇంగ్లిష్ లో మాట్లాడారు.

'' పహల్గాం దాడికి ప్రతీకారంగానే ఈ ఆపరేషన్ చేపట్టాం. 9 ఉగ్రస్థావరాలపై దాడులు జరిపాం. గత మూడు దశాబ్దాల్లో పాకిస్తాన్‌లో ఎన్నో ఉగ్ర స్థావరాలు నెలకొల్పారు. ఇక్కడ రిక్రూట్‌మెంట్, భారత్‌పై విద్వేషాన్ని నూరిపోసేలా ప్రసంగాలు ఇవ్వడం, శిక్షణ కేంద్రాలున్నాయి'' అని సోఫియా ఖురేషీ చెప్పారు. '' ఈ దాడుల్లో పాకిస్తాన్ ఆర్మీ సంబంధ ప్రాంతాల జోలికి వెళ్లలేదు. అత్యంత కచ్చితత్వంతో ఉగ్రవాదుల స్థావరాలపైనే దాడులు చేశాం. దాడి ప్రాంత పరిధికి తగ్గట్లుగా సరైన ఆయుధాలను, అనువైన సాంకేతికతను వినియోగించాం. దీని వల్ల లక్ష్యాలను మాత్రమే ధ్వంసంచేశాం. చుట్టుపక్కల ప్రాంతాలకు ఎలాంటి నష్టం జరగలేదు. ముందుగా నిర్ణయించుకున్న భవనాలను మాత్రమే నేలమట్టంచేశాం. ఆ శిబిరాల్లోని ఉగ్రవాదులను హతమార్చాం. లక్ష్యాల ఛేదనలో భారత సాయుధ బలగాల ప్రణాళికా రచన, దాడి, సామర్థ్యాలను ఈ దాడులు మరోసారి చాటిచెప్పాయి. ఇకమీదట పాకిస్తాన్ ఉద్రిక్తతలను పెంచుతూ దాడులు చేయాలని చూస్తే భారత్ కనీవినీ ఎరుగని రీతిలో దాడులతో విరుచుకుపడుతుందని మరోసారి స్పష్టంచేస్తున్నా. జై హింద్'' అని వ్యోమికా సింగ్ తన మీడియా బ్రీఫింగ్‌ను ముగించారు. ఈ ఇద్దరు మహిళాధికారుల మధ్యలో కూర్చొని మీడియాకు వివరాలు వెల్లడించిన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఒక కశ్మీరీ పండిట్. కీలక ప్రెస్‌మీట్‌లో ఎవరెవరు వేదికపై ఆసీనులై భారతవాణిని ప్రపంచానికి వినిపించాలనే విషయంలో కేంద్రప్రభుత్వానికి అత్యంత స్పష్టత ఉందని ఈ ముగ్గురిని చూస్తే తెలుస్తోంది.

## ఆపరేషన్ సిందూర్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని మోడీ భేటీ



ఈ కబురు: పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయింది. ఇన్నాళ్లు పాక్ ప్రభుత్వం అండదండలతో ఆ దేశ భూభాగంలో కొనసాగుతున్న 9 ఉగ్ర శిబిరాలపైకి ఇండియన్ ఆర్మీ మెరుపు దాడులు చేసింది. ఈ ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. ఆ పరేషన్ సిందూర్ తర్వాత రాష్ట్రపతితో ప్రధాని భేటీ కావడం ఇదే తొలిసారి. ఇవాళ ఉదయం కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం రాష్ట్రపతి భవన్ కు వెళ్లిన మోడీ అక్కడ ముర్ముతో భేటీ అయి ఈ ఆపరేషన్ కు సంబంధించిన వివరాలను వివారించారు. ఆపరేషన్ చేపట్టిన తీరు, మన సైన్యం ధైర్య సాహసాలను ముర్ముకు వివరించారు. మరో వైపు ప్రభుత్వం రేపు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నది. ఈ భేటీలో ఆపరేషన్ సిందూర్ తర్వాతి పరిణామాలను అఖిలపక్ష పార్టీలకు వివరించనున్నది.

## తొలి వారం తెలంగాణ పరిచయం



ఈ కబురు: హైదరాబాద్: గ్రామీణ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు 'మిస్ వరల్డ్ 2025' పోటీలను అవకాశంగా మలచుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ గ్రామీణ, సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవాన్ని చాటి చెప్పడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రపంచంలోని 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీల ఈవెంట్‌లో రాష్ట్రంలోని గ్రామీణ పర్యాటకాన్ని హైలైట్ చేయనున్నారు. మిస్ వరల్డ్ అసలు పోటీలు ఈ నెల 17 నుంచి మొదలుకానున్నాయి. దాదాపు 110 దేశాల నుంచి వస్తున్న అందగత్తెలు తొలి వారమంతా తెలంగాణలో రెండు బృందాలుగా విడిపోయి పర్యటించనున్నారు. మన చారిత్రక కట్టడాలు, సంస్కృతిని వీరికి పరిచయం చేస్తారు. ఆ తర్వాతే అసలుసిసలు పోటీ మొదలవుతుంది. అందాల పోటీల వేడుకల ప్రారంభానికి ఇంకా రెండు రోజుల సమయమే ఉండటంతో వివిధ దేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. మంగళవారం వరకు 28 మంది రాగా.. బుధవారం 40 మందికి పైగా.. కజఖ్‌స్థాన్, సింగపూర్, డెన్మార్క్, కెన్యా, శ్రీలంక, బెల్జియం తదితర దేశాల సుందరీమణులు వచ్చారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలతో వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది. ఈ నెల 10న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభించనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు పోటీదారులు స్టేడియంలో రిహార్సల్స్ చేస్తారని మిస్ వరల్డ్ స్పోర్ట్స్ ఫైనల్ పోటీలు ఈ నెల 17న గచ్చిబౌలిలో ప్రారంభం కానున్నాయి. ఫిట్‌నెస్, ఆరోగ్యం, సానుకూల దృక్పథం, క్రీడానైపుణ్యాల వంటివి పరీక్షిస్తారు. క్రికెట్, ఫుట్‌బాల్, షూటవుట్, షటిల్ రన్, హాకీ షూటవుట్, 400 మీటర్ల రేస్ వంటి అంశాల్లో పోటీలుంటాయి. ఈ నెల 20, 21 తేదీల్లో టీ హబ్ వేదికగా కాంటినెంటల్ ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఇందులో విజేతలైనవారు ఆయా ఖండాల తరఫున ఫైనల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. శిల్పాకళా వేదిక కేంద్రంగా ఈ నెల 22న టాలెంట్ ఫినాలే ఉంటుంది. పోటీదారుల అందం, ప్రతిభ వంటి అంశాలను పరీక్షిస్తారు. ఈ నెల 23న హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో 'బ్యూటీ విత్ ఏ పర్పస్' అనే అంశంలో పోటీదారులు సామాజికాంశాలపై తమ నిబద్ధతను న్యాయనిర్ణేతల ముందు ప్రదర్శించనున్నారు. ట్రైడెంట్ హోటల్‌లో ఈ పోటీలు జరుగుతాయి. ఈ నెల 10న ప్రారంభ వేడుక దగ్గర్నుంచి 31న జరిగే ముగింపు వరకు 28 కార్యక్రమాలు నిర్వహిస్తుండగా... పరిమితంగా మాత్రమే సామాన్యులు పాల్గొనే అవకాశం ఉంది. గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభ వేడుక, ఇండోర్ స్టేడియంలో జరిగే క్రీడా పోటీలకు హాజరు కావొచ్చు. 24న హైటెక్స్‌లో జరిగే జ్యుయలరీ ఫ్యాషన్ షోను వీక్షించేందుకు సామాన్యులకు అవకాశం ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. https://tourism.telangana.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని పాసులు పొందవచ్చు. తెలంగాణ పర్యాటకం, సంస్కృతి, అందాల పోటీలపై అడిగే ఆరు ప్రశ్నల్లో ఐదింటికి సరిగ్గా సమాధానాలు చెబితేనే పాస్ లభిస్తుంది. మొత్తంగా ఐదు వేల మందికి ఉచితంగా ప్రవేశ పాస్‌లు అందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. 31న గ్రాండ్ ఫినాలే.. హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ ఫైనల్ పోటీలు ఈ నెల 31న జరగనున్నాయి. రౌండ్లవారీగా అభ్యర్థుల వడపోత అనంతరం మిస్ వరల్డ్ విజేతను ప్రకటిస్తారు. ఫైనల్ పోటీలకు న్యాయనిర్ణేతల్లో నటుడు సోనూ సూద్ కూడా ఒకరు.

# హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన సివిల్ మాక్‌డ్రిల్



**భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది.**

ఈ కబురు: భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో జరిగిన ఈ మాక్ డ్రిల్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహనకు మాక్ డ్రిల్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రెండు నిమిషాల పాటు సైరన్ మోగింది. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో సైరన్లు మోగాయి. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వివరించారు. నగరంలోని నాలుగు ప్రాంతాలు (నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ) నుంచి కొనసాగిన మాక్ డ్రిల్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

మరోవైపు, మాక్ డ్రిల్‌లో భాగంగా ఫైరింగ్ జరిగినట్లుగా శబ్దాలు వినబటం, కొందరు సంఘ విద్రోహ శక్తులు కాల్పులు జరుపుతుండటం, ఒక భవనంలోకి వెళ్లి కాల్పులు జరిపితే.. అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్నట్లుగా దృశ్యాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. డీఆర్‌డీఏ సమీపంలోని ఓ కాలనీలోని 24 అంతస్తుల భవనంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎలా సురక్షితంగా కాపాడాలనే అంశాన్ని వివరించారు. అక్కడ ఫైరింజన్లను మోహరించారు. మొత్తంగా 12శాఖల అధికారుల సమన్వయంతో ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కాల్పుల్లో గాయపడిన వారిని తోటివారి సహాయంతో సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే అంశంపై అవగాహన కల్పించారు. మరోవైపు, విశాఖలోని పాత పోస్ట్‌ఆఫీస్ కూడలిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు.



# పసిడి.. మళ్లీ లక్షకు చేరువలో

**రూ.2,400 పెరుగుదల భౌగోళిక ఉద్రిక్తతలు, టారిఫ్ షాక్‌లు**

**న్యూఢిల్లీ:** పసిడి మరోసారి ర్యాలీ చేసింది. ఢిల్లీ మార్కెట్లో మంగళవారం 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,400 లాభపడి రూ.99,750 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా టారిఫ్‌లపై చేసిన ప్రకటన, భౌగోళిక ఉద్రిక్తతలతో బంగారానికి డిమాండ్ ఏర్పడింది. జ్యుయలర్ల నుంచి కొనుగోళ్లు పెరిగినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.2,400 పెరిగి రూ.99,300 వద్ద స్థిరపడింది. "ట్రంప్ ఫార్మాస్యూటికల్స్‌పై, అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం టారిఫ్‌లను ప్రతిపాదించారు.

దీంతో వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయ వృద్ధిపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలు నెలకొన్నాయి. ఈ పరిణామాలతో సురక్షిత సాధనమైన బంగారానికి తిరిగి డిమాండ్ ఏర్పడింది" అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. బుధవారం యూఎస్ ఫెడ్ పాలసీ సమీక్ష వివరాల కోసం మార్కెట్ భాగస్వాములు ఎదురు చూస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఇక ఢిల్లీలో వెండి ధర కిలోకి రూ.1,800 పెరిగి రూ.98,500కు చేరుకుంది.

అంతర్జాతీయ మార్కెట్లో 3,400 డాలర్లపైకి అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ర్యాలీ కొనసాగుతోంది. ఔన్స్‌కు 100 డాలర్ల వరకు పెరిగి 3,422 డాలర్ల స్థాయికి చేరింది. అమెరికా డాలర్ బలహీనత సైతం బంగారం ధరల పెరుగుదలకు దారితీసినట్టు హెచ్‌డీఎఫ్‌సీ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.






# ఐపీవోకు 5 కంపెనీలు రెడీ
# సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్

**జాబితాలో లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ జజూ రష్మీ రిఫ్రాక్టరీస్, అజయ్ పాలీ రెగాల్ రిసోర్సెస్, వెరిటాస్ ఫైనాన్స్**

**న్యూఢిల్లీ:** కొద్ది రోజులుగా పుంజుకున్న ప్రైమరీ మార్కెట్ ప్రభావంతో పలు కంపెనీలు మరోసారి లిస్టింగ్ బాటలో సాగుతున్నాయి. తాజాగా ఐదు కంపెనీల ప్రాస్పెక్టస్‌లకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదముద్ర వేసింది. జాబితాలో వెరిటాస్ ఫైనాన్స్, లక్ష్మీ ఇండియా ఫైనాన్స్, అజయ్ పాలీ, జజూ రష్మీ రిఫ్రాక్టరీస్, రెగాల్ రిసోర్సెస్ చేరాయి. ఈ 5 కంపెనీలు 2024 డిసెంబర్, 2025 జనవరిలో సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. అయితే మరోపక్క ఈ ఏడాది జనవరి 6న లిస్టింగ్‌కు వీలుగా సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసిన ఎర్త్డ్ సర్వెసెస్ ఇటీవల ఐపీవో డాక్యుమెంట్లను వెనక్కి తీసుకుంది.

**రూ. 2,800 కోట్లు:** నాన్‌డిపాజిట్ ఎన్‌బీఎఫ్‌సీ వెరిటాస్ ఫైనాన్స్ ఐపీవో ద్వారా రూ. 2,800 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,200 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. రిటైల్ విభాగంపై అధిక దృష్టిపెట్టిన కంపెనీ ఈక్విటీ జారీ నిధులను రుణ విడుదలకు సహకరించే మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

**ఎన్‌బీఎఫ్‌సీ..:** ఎన్‌బీఎఫ్‌సీ.. లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ ఐపీవోలో భాగంగా 1.04 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 56.38 లక్షల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను భవిష్యత్ అవసరాలకు సహకరించే మూలధన పటిష్టత, కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిఫ్రిజిరేషన్ సీలింగ్: రిఫ్రిజిరేషన్ సీలింగ్ సొల్యూషన్లు అందించే అజయ్ పాలీ ఐపీవోలో భాగంగా రూ. 238 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 93 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులతోపాటు ప్లాంట్, మెషినరీ తదితర పెట్టుబడి వ్యయాలకు వెచ్చించనుంది.

**రూ. 190 కోట్లు సహా..:** రెగాల్ రిసోర్సెస్ ఐపీవోలో భాగంగా రూ. 190 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు ప్రమోటర్ 90 లక్షల షేర్ల వరకూ ఆఫర్ చేయనున్నట్లు ప్రాస్పెక్టస్‌లో కంపెనీ పేర్కొంది. రూ. 150 కోట్లు మాత్రమే: ప్రాస్పెక్టస్ ప్రకారం జజూ రష్మీ రిఫ్రాక్టరీస్ ఐపీవోలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. నిధులను జార్ఖండ్‌లోని బొకారో ఫెర్రో అల్లాయ్స్ విస్తరణకు వీలుగా కొత్త తయారీ సౌకర్యాలపై వెచ్చించనుంది. నిధులలో కొంతమేర వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు సైతం వినియోగించనుంది.

**మెప్పించని ఏథర్ ఎనర్జీ ఎంట్రీ**

**ముంబై:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ షేరు లిస్టింగ్ రోజే నష్టాలు చవిచూసింది. ఇష్యూ ధర(రూ.321)తో పోలిస్తే బీఎస్ఈలో 1.57% స్వల్ప ప్రీమియంతో రూ.326 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ ప్రారంభంలో 4% లాభపడి రూ.333 వద్ద గరిష్టాన్ని తాకింది. అయితే మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల దృష్ట్యా షేరు అమ్మకాల ఒత్తిడికి లోనై ఆరంభ లాభాలు కోల్పోయింది. ఒకానొక దశలో 6.50% క్షీణించి రూ.300 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 6% నష్టంతో రూ. 302.50 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ వాల్యుయేషన్ రూ.11,267 కోట్లుగా నమోదైంది. "ఏథర్ ఎనర్జీ షేరు నామమాత్రపు ధరతో లిస్టింగ్ అవ్వడం, ఇంట్రాడేలో 6.50% పతనం పరిణామాలను పరిశీలిస్తే ఇన్వెస్టర్లు అధిక వాల్యుయేషన్ల పట్ల అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తుంది" అని లెమాన్ మార్కెట్స్ డెస్క్ విశ్లేషకుడు గౌరవ్ గార్గ్ తెలిపారు.





# భారత సూచీలకు లాభాలు..

**ఉగ్రమూకలను ఏరివేసేందుకు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద శిక్షణా శిబిరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ సైన్యం చేసిన కచ్చితమైన దాడుల నేపథ్యంలో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి.**

బీఎస్ఈ సెన్సెక్స్ 105.71 పాయింట్లు (0.13 శాతం) పెరిగి 80,746.78 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 34.80 పాయింట్లు (0.14 శాతం) లాభపడి 24,414.40 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.36 శాతం, బీఎస్ఈ స్మాల్ క్యాప్ 1.16 శాతం లాభపడటంతో విస్తృత మార్కెట్లు బెంచ్ మార్క్ సూచీలను అధిగమించాయి. రంగాలవారీ సూచీల్లో నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఫార్మా, హెల్త్ కేర్ మినహా మిగతా అన్ని రంగాలు గ్రీన్‌లో ముగియడంతో ఆటో, మీడియా, రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1 శాతానికి పైగా పెరిగాయి. సెన్సెక్స్ లోని 30 షేర్లలో 17 షేర్లు లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్ 5.2 శాతం, బజాజ్ ఫైనాన్స్ 2.02 శాతం, ఎటర్నల్ 1.41 శాతం, అదానీ పోర్ట్స్ 1.41 శాతం, టైటాన్ 1.27 శాతం లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్ 4 శాతం, సన్ ఫార్మా 1.95 శాతం, ఐటీసీ1.3 శాతం, నెస్లే ఇండియా1.06 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.01 శాతం నష్టపోయాయి.

## పాక్ మార్కెట్ క్రాష్

**పాక్ స్టాక్ మార్కెట్ కుదేలు**

పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత్ జరిపిన దాడుల ప్రభావంతో పాకిస్తాన్ స్టాక్ మార్కెట్ బుధవారం కుప్పకూలింది. ఆ దేశ ప్రధాన స్టాక్ మార్కెట్ సూచీ కేఎస్ఈ 100 (కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్) ప్రారంభ ట్రేడింగ్లో 6,272 పాయింట్లు లేదా 6 శాతం పడిపోయింది. భారత్ 'ఆపరేషన్ సింధూర్' చేపట్టిన కొన్ని గంటల్లోనే కేఎస్ఈ100 సూచీ క్షీణించి 1,12,076.38 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. ప్రస్తుతానికి పాకిస్తాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (పీఎస్ఎక్స్) కోలుకునే సూచనలు కనిపించలేదు. పీఎస్ఎక్స్ వెబ్‌సైట్ మూతపడింది. ఆ వెబ్‌సైట్ తెరిస్తే "తదుపరి నోటీసు వచ్చే వరకు నిర్వహణలో ఉంటుంది" అన్న సందేశం కనిపిస్తోంది.

# ప్రభుత్వ రుణం దిగిరావాలి




**అప్పుడే రేటింగ్ అప్‌గ్రేడ్**
**ఆర్థిక వ్యహారాల కార్యదర్శి అజయ్‌సేత్**

పెరిగిన ప్రభుత్వ రుణం మోస్తరు స్థాయికి దిగిరావాల్సి ఉందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్‌సేత్ అన్నారు. తద్వారా వడ్డీ చెల్లింపులు తగ్గుతాయని, అప్పుడే రేటింగ్ అప్‌గ్రేడ్ అవుతుందన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అనిశ్చితులు పెరిగిపోతున్న నేపథ్యంలో భారత్ ఏదో ఒక నిర్దిష్టమైన మార్గానికి పరిమితం కాకూడదన్నారు.

'మారుతున్న పరిణామాలకు మనం చురుగ్గా స్పందించాలి. నేడు భారత ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి సమీపించింది. మిగిలిన ప్రపంచ వ్యాప్తంగా ఏం జరుగుతుందన్నది తెలుసుకునేంత సామర్థ్యం మనకు ఉంది. ఈ దిశగా మనదైన మార్గాన్ని గుర్తించాలి' అని వివరించారు. ప్రభుత్వ రుణం ప్రస్తుత స్థాయిల నుంచి కచ్చితంగా దిగిరావాలంటూ.. అందుకు ద్రవ్య స్థిరీకరణను మార్గంగా పేర్కొన్నారు.

దేశ జీడీపీలో పన్నుల వాటా దశాబ్దం క్రితం 16.5 శాతంగా ఉంటే, అది ప్రస్తుతం 18 శాతానికి చేరినట్టు అజయ్‌సేత్ తెలిపారు. ప్రస్తుత ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే మరో 5-6 ఏళ్లలో 20 శాతానికి పన్నుల వాటా చేరుకోగలదన్నారు. వ్యయాల గురించి మాట్లాడుతూ.. మూలధన వ్యయాలకు అనుకూలంగా తగిన సర్దుబాట్లు జరుగుతున్నట్టు చెప్పారు.







# జీడీపీ వృద్ధి 6.3 శాతమే! కారణం..

**భారత జీడీపీ 2025లో 6.3 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని మూడీస్ రేటింగ్స్ తాజా అంచనాలు ప్రకటించింది. 6.5 శాతం వృద్ధి సాధిస్తుందంటూ గతంలో వెల్లడించిన అంచనాలను తగ్గించింది. అమెరికా టారిఫ్‌లు, వాణిజ్య ఆంక్షలతో వృద్ధి నిదానించొచ్చని పేర్కొంది. అంతర్జాతీయంగా ఉన్న భౌగోళిక ఉద్రిక్తతలకు తోడు.. భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు సైతం జీడీపీ వృద్ధి అంచనాలపై ప్రభావం చూపిస్తాయని తెలిపింది.**

ఈ నేపథ్యంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి, ఎక్కడ విస్తరణ చేపట్టాలి, ముడి పదార్థాల సమీకరణ తదితరాల వ్యయాలు పెరిగిపోవచ్చని పేర్కొంది. 2026 సంవత్సరానికి మాత్రం లోగడ ప్రకటించిన 6.5 శాతం వృద్ధి రేటు అంచనాలనే మూడీస్ కొనసాగించింది. 2024 కేలండర్ సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతంగా ఉండడం గమనార్హం. విధానపరమైన అస్పష్టత, అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలతో 2025, 2026 సంవత్సరాలకు సంబంధించి అంతర్జాతీయ వృద్ధి రేటు అంచనాలను తగ్గిస్తున్నట్టు మూడీస్ రేటింగ్స్ తెలిపింది.

**ప్రపంచ వృద్ధిపైనా ప్రభావం..**
టారిఫ్‌లకు అమెరికా స్వల్పకాలం పాటు విరామం ఇచ్చినప్పటికీ చైనా-అమెరికా మధ్య ఉద్రిక్తతలు జీ-20 దేశాల వ్యాప్తంగా అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులకు విఘాతం కలిగిస్తాయని మూడీస్ రేటింగ్స్ తెలిపింది. 2025లో అమెరికా, చైనా జీడీపీ అంచనాలను సైతం కుదించింది. అమెరికా జీడీపీ 2025లో 1 శాతం, 2026లో 1.5 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేయొచ్చని అంచనా వేసింది. గత అంచనాలు కుదించింది. చైనా 2025లో 3.8 శాతం, 2026లో 3.9 శాతం చొప్పున వృద్ధి చెందొచ్చని పేర్కొంది.
మొత్తం మీద అమెరికాకు సంబంధించి టారిఫ్‌లు గరిష్ట స్థాయికి చేరాయని.. రానున్న రోజుల్లో ఇవి తగ్గుతాయని అంచనా వేస్తున్నట్టు తెలిపింది. తరచుగా ఆర్థిక మార్కెట్లలో అస్థిరతలు లిక్విడిటీని (ద్రవ్య లభ్యత) కఠినతరం చేస్తాయని, ఇది నిధులపై వ్యయాలు గణనీయంగా పెరిగేందుకు దారితీస్తుందని మూడీస్ తెలిపింది. వృద్ధికి ఇది విఘాతం కలిగించొచ్చని పేర్కొంది.



## ముందు స్టంట్‌మ్యాన్‌ని.. అందుకు
# గర్వంగా ఉంది: మంచు విష్ణు

**తాను యాక్టర్ కాకముందు స్టంట్‌మ్యాన్‌గా పని చేశానని మంచు విష్ణు తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.**

తన గురించి ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు మంచు విష్ణు . యాక్షన్ సీక్వెన్స్ డిజైన్ చేసే అవకాశం చాలాకాలం తర్వాత 'కన్నప్ప' తో లభించిందన్నారు. సంబంధిత గ్లింప్స్ విడుదల చేశారు. ''నేను మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందా. నటుడిని కాకముందు లాస్‌ఏంజెల్స్‌లో స్టంట్‌మ్యాన్‌గా పని చేశా. ఈ విషయం చాలా మందికి తెలియదు. తెలుగు స్టంట్ యూనియన్ మెంబర్‌గా ఉన్నందుకు గర్వపడుతున్నా. షో రన్నర్‌గా 'కన్నప్ప'లోని యాక్షన్ సీన్స్ డిజైన్ చేశా. వాటికి ప్రాణం పోసిన కెచా మాస్టర్‌కు కృతజ్ఞతలు'' అని పేర్కొన్నారు. మరోవైపు, యూఎస్‌లో నిర్వహించే ఆ సినిమా ప్రమోషన్స్ షెడ్యూల్ వివరాలు ప్రకటించారు. ఈ నెల 8న న్యూజెర్సీ, 9న డల్లాస్, 10న బే ఏరియాలో వేడుకలు ఏర్పాటు చేయనున్నారు. శివ భక్తుడైన కన్నప్ప జీవితాధారంగా దర్శకుడు ముకేశ్ కుమార్‌సింగ్ తెరకెక్కించిన చిత్రమిది. ఈ విష్ణు డ్రీమ్ ప్రాజెక్టులో ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్ తదితర స్టార్స్ ప్రత్యేక పాత్రల్లో నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కథను విష్ణు రాయడం విశేషం. ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించిన మోహన్‌బాబు సినిమాలో కీలక పాత్ర పోషించారు. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా జూన్ 27న విడుదల కానుంది.

# ఆ మార్పు కి నేను సిద్ధంగా ఉన్నాను: హీరో శ్రీవిష్ణు



**'నేను ఇండస్ట్రీకి వచ్చి పదహారేళ్ల అవుతుంది. ఈ పదహారేళ్లలో ఎక్కడ కూడా బోర్ కొట్టించని సినిమాలే చేశానని భావిస్తున్నాను. రానున్న రోజులలో చాలా మార్పులు రాబోతున్నాయి. పెద్ద రెవల్యూషన్ రాబోతుంది. నెక్స్ట్ జనరేషన్ కిడ్స్ రాబోతున్నారు. ఆ మార్పు కి నేను సిద్ధంగా ఉన్నాను. ప్రతి క్యారెక్టర్ లో ది బెస్ట్ ఇచ్చుకుంటూ వెళ్తున్నాను' అన్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం #సింగిల్. కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి కార్తిక్ రాజు దర్శకత్వం వహించారు. మే9న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా హీరో శ్రీవిష్ణు మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..**

○ డైరెక్టర్ కార్తీక్ రాజు ఈ సినిమా కథ చెప్పినప్పుడు చాలా మంచి ఎంటర్టైనర్ అవుతుందని నమ్మకం కలిగింది. ఫైనల్ గా సినిమా చూసుకున్న తర్వాత చాలా పెద్ద ఎంటర్టైనర్ అవుతుందని అనిపించింది.ఇప్పటివరకు విడుదలైన టీజర్ ట్రైలర్ పాటలకి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రమోషన్స్ కూడా చాలా పాజిటివ్ గా ఉన్నాయి. ఇదంతా టీమ్ ఎఫర్ట్ అని భావిస్తున్నాను.

○ ఈ సినిమా క్లైమాక్స్ కొత్తగా ఉంటుంది. నా క్యారెక్టర్, వెన్నెల కిషోర్ గారి క్యారెక్టర్. ఇద్దరు హీరోయిన్స్ క్యారెక్టర్స్ ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ నాలుగు క్యారెక్టర్లు కూడా ఆడియన్స్ కి చాలా నచ్చుతాయి. క్లైమాక్స్ చాలా యూనిక్ గా ఉంటుంది. అందరిని ఎంటర్టైన్ చేస్తుంది.

○ సినిమాని కంప్లీట్ గా హైదరాబాద్ లో తీసాం. హైదరాబాద్‌ని చాలా కొత్తగా చూపించాం. ఈ మధ్యకాలంలో హైదరాబాద్ ని ఇంత కొత్తగా ఎవరు చూపించలేదు. చాలా బెస్ట్ మూమెంట్స్ ని క్యాప్చర్ చేశాం.

○ నేను ప్రతి క్యారెక్టర్ నీ ఎంజాయ్ చేస్తాను. డైరెక్టర్ తోనే ఎక్కువ ట్రావెల్ చేస్తాను. ఆ ట్రావెల్ లోనే 50% వచ్చేస్తుంది. తర్వాత లొకేషన్ లో ఇంకొంత క్యారెక్టర్ మీద కమాండ్ పెరుగుతుంది.

○ ఈ సినిమాలో నా బాడీ లాంగ్వేజ్ కొత్తగా ఉంటుంది. ఇందులో లవ్‌స్టోరీ ఉంటుంది. దానికి తగ్గట్లుగానే నా బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. గత చిత్రాలతో పోల్చుకుంటే ఈ సినిమాలో ఒక డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్ ఆడియన్స్ చూస్తారు.

○ సినిమా ఒక హైపర్ ఎనర్జీతో వచ్చింది. దానికి తగ్గట్టు విశాల్ చంద్రశేఖర్ ఎనర్జిటిక్ సాంగ్స్ ఇచ్చారు. ఆర్ఆర్ చాలా బాగా చేశారు. చాలా కొత్తగా ఉంటుంది. చాలా ఇన్నోవేటివ్ సౌండ్ ఉంటుంది

○ సామజవరగమన, ఓం భీమ్ బుష్ సినిమాల తర్వాత వచ్చిన సినిమా కావడంతో స్వాగ్ ఒక ఫుల్ కామెడీ సినిమా అనుకున్నారు. మేము కూడా ప్రాపర్ కంటెంట్ ఇలా ఉంటుందని ప్రిపేర్ చేయలేకపోయాం. అందుకే చిన్న కన్ఫ్యూజన్ ఏర్పడిందని అనుకుంటున్నాను. ఫుల్ ఫన్ అని వచ్చిన వాళ్ళు కొంత డిసప్పాయింట్మెంట్ అయిన మాట నిజమే. ఒక డిఫరెంట్ కంటెంట్ సినిమా చూడాలనే ఆడియన్స్ కి సినిమా చాలా నచ్చింది. టెలివిజన్ లో వచ్చిన తర్వాత కూడా చాలా మంచి అప్లోజ్ వచ్చింది. ప్రయోగం చేసినప్పుడు వర్క్ కాకపోతే దానిని ఎక్స్పీరియన్స్ కింద చూడాలి. వర్క్ అయినా వర్క్ కాకపోయినా కొత్త ప్రయత్నం మానకూడదని నా అభిప్రాయం.

○ గీతా ఆర్ట్స్ లో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఎప్పటినుంచో గీతా ఆర్ట్స్ లో చేయాలి. లక్కీగా ఈ సినిమా కుదిరింది 100% కాన్ఫిడెన్స్ ఉన్న జోనర్ ఇది. ఈ జోనర్ లో గీత ఆర్ట్స్ తో చేయడం వెరీ వెరీ హ్యాపీ.

○ ప్రస్తుతం మృత్యుంజయ అనే ఒక థ్రిల్లర్ చేస్తున్నాను. అలాగే ఒక ఫ్యామిలీ ఎంటర్టైనర్ చేస్తున్నాను.అలాగే ఒక ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఒక సినిమా చేస్తున్నాను.



# తమిళంలో బ్లాక్ బస్టర్.. తెలుగులో డైరెక్ట్ ఓటీటీలో?

కొన్నిసార్లు చిన్న సినిమానే కదా ఏమవుతుందిలే అనుకుంటాం. కానీ అదే భారీ దెబ్బ కొట్టొచ్చు. తమిళ ప్రేక్షకుల్ని ప్రస్తుతం ఎంటర్ టైన్ చేస్తున్న 'టూరిస్ట్ ఫ్యామిలీ'ని చూస్తే అదే అనిపిస్తుంది. ఎందుకంటే సూర్య 'రెట్రో'కి పోటీగా రిలీజ్ అనేసరికి చాలామంది.. బాక్సాఫీస్ దగ్గర నిలబడుతుందా అనుకున్నారు. కానీ ఇప్పుడదే సూపర్ రెస్పాన్స్ సంపాదించుకుంది. చాలా తక్కువ బడ్జెట్, సింపుల్ కథతో తీసిన ఈ సినిమా మే 01న రిలీజైతే ఇప్పటివరకు రూ.20 కోట్ల కలెక్షన్స్ కూడా రాలేదు. ఎందుకంటే తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో టికెట్ రేట్లు చాలా తక్కువగా ఉంటాయి. పోటీలో ఉన్న రెట్రో కంటే దీన్ని చూసేందుకే ఫ్యామిలీ ఆడియెన్స్ ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు.

అసలు విషయానికొస్తే ఈ సినిమాని త్వరలో తెలుగులోనూ డబ్ చేసి రిలీజ్ చేస్తారనే టాక్ వినిపిస్తుంది కానీ అది జరిగే పనిలా అనిపించట్లేదు. ఎందుకంటే ఇది తమిళ ఫ్లేవర్ తో తెరకెక్కిన కథ. దీన్ని తెలుగులో ఆదరిస్తారా అంటే సందేహమే. అదే టైంలో ఓటీటీలో రావడానికి నాలుగు వారాల ఒప్పందాన్ని కుదుర్చుకున్నారట.
ఈ లెక్కన చూసుకుంటే 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా ఓటీటీలోకి మే 31న వచ్చే సూచనలు గట్టిగా ఉన్నాయి. తెలుగు వెర్షన్ కూడా అప్పడే అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు కనిపిస్తుంది. ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఈ మూవీలో సిమ్రాన్ తప్పితే మనకు తెలిసిన ముఖం లేదు.





# దర్శకుడితో సమంత పెళ్లి రూమర్స్.. పోస్ట్ వైరల్

గతంలో హీరో నాగచైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకున్న సమంత.. తర్వాత విడాకులు తీసుకుంది. ఇది జరిగి దాదాపు నాలుగేళ్లు గడిచిపోయాయి. అప్పటినుంచి ఒంటరిగానే ఉంటోంది. కానీ గత కొన్నిరోజుల క్రితం సమంత పెళ్లి గురించి రూమర్స్ వినిపించాయి. ఇప్పుడదే దర్శకుడితో మళ్లీ కనిపించడం, ఆ ఫొటోలని పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

విడాకుల తర్వాత సమంత.. తాను మయాసైటిస్ అనే అరుదైన వ్యాధి బారిన పడ్డాననే విషయాన్ని బయటపెట్టింది. మధ్యలో విజయ్ దేవరకొండతో కలిసి ఖుషి సినిమా చేసింది. ఇది తప్పితే మరో మూవీ చేయలేదు. మధ్యలో ఓ వెబ్ సిరీసులో నటించిందంతే. సరే అసలు విషయానికొస్తే.. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ లో రెండో సీజన్ లో సమంత నటించింది. ఈ సిరీస్ చేసిన దర్శకుల్లో ఒకరైన రాజ్ తో రీసెంట్ టైంలో సమంత ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూనే ఉంది. కొన్నిరోజుల క్రితం ఇద్దరూ కలిసి తిరుపతి కూడా వెళ్లొచ్చారు. దీంతో ఇద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారనే పుకార్లు వినిపించాయి. సామ్ నుంచి రెస్పాన్స్ లేదు కాబట్టి ఇది రూమర్ గానే మిగిలిపోయింది.

తాజాగా న్యూ బిగినింగ్స్ అని ఓ పోస్ పెట్టింది. ఇందులో తన త్రలాలా నిర్మాణ సంస్థ గురించి, తాను నిర్మించిన శుభం మూవీ గురించి కొన్ని ఫొటోలు షేర్ చేసింది. ఇందులోనూ రాజ్ తో సమంత దిగిన కొన్ని ఫొటోలు కనిపించాయి. దీంతో బయట వినిపిస్తున్న రూమర్స్ ని ఏమైనా నిజం చేస్తారా అని నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు.



## పిల్లల చదువు కోసం
# రూ.10 కోట్ల దానం



తమిళ హీరో సూర్య మంచి మనసు చాటుకున్నాడు. గత కొన్నాళ్లుగా సినిమాలైతే చేస్తున్నాడు గానీ సరైన హిట్ పడట్లేదు. రీసెంట్ గా రెట్రో మూవీతో ప్రేక్షకుల్ని పలకరించాడు. తెలుగులో తేలిపోయింది గానీ తమిళంలో మంచి వసూళ్లు సాధిస్తోంది. ఇప్పుడు తన చిత్రానికి వచ్చిన లాభాల నుంచి ఏకంగా రూ.10 కోట్లని సూర్య దానం చేశాడు.

రెట్రో సినిమాలో సూర్య హీరోగా నటించాడు. ఇతడికి చెందిన 2డీ ఎంటర్ టైన్ మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. తాజాగా రూ.104 కోట్ల మేర గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే లాభాలు రావడంతో హీరో కమ్ నిర్మాత అయిన సూర్య ఫుల్ హ్యాపీ అయిపోయాడు. తనకు చెందిన అగరం ఫౌండేషన్ కి రూ.10 కోట్లు దానం చేశాడు. ఈ మేరకు నిర్వహకులకు చెక్ అందజేశాడు.

2006లో అగరం ఫౌండేషన్ ని సూర్యనే స్థాపించాడు. తమిళనాడులో చదివించే స్థోమత లేని చాలామంది పిల్లలని చదివించడమే ఈ సంస్థ ఉద్దేశం. ఇప్పటికే చాలామంది అగరం ద్వారా చదువుకుని ప్రయోజకులు అయ్యారు.





# కీలక మ్యాచ్‌లో కోల్‌కతా ఓటమి..
# చెన్నైకి మూడో విజయం

**కీలక మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఓటమి పాలైంది. ఈడెన్ గార్డెన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 2 వికెట్ల తేడాతో నెగ్గింది.**

**కోల్‌కతా:** ఐపీఎల్ 18 సీజన్‌లో కీలక మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఓటమి పాలైంది. ఈడెన్ గార్డెన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతాపై చెన్నై సూపర్ కింగ్స్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో 12 మ్యాచ్‌ల్లో ఆరో ఓటమిని ఎదుర్కొన్న కోల్‌కతా ప్లే ఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. తొలుత కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని చెన్నై 19.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. డెవాల్డ్ బ్రెవిస్ (52; 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. శివమ్ దూబె (45; 40 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన ఉర్విల్ పటేల్ (31; 11 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. ధోనీ (17*; 18 బంతుల్లో 1 సిక్స్) చివర్లో కీలక పరుగులు చేశాడు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా 3, వరుణ్ చక్రవర్తి 2, హర్షిత్ రాణా 2, మొయిన్ అలీ ఒక వికెట్ తీశారు. ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగిన చెన్నైకి 12 మ్యాచ్‌ల్లో ఇది మూడో విజయం.



కోల్‌కతా బ్యాటర్లలో ఓపెనర్ రహ్మానుల్లా (11) త్వరగానే నిష్క్రమించగా.. సునీల్ నరైన్ (26; 17 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా.. ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కెప్టెన్ అజింక్య రహానె (48; 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఆండ్రీ రస్సెల్ (38; 21 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. మనీశ్ పాండే (36*; 28 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ (4/31) మెరిశాడు. అన్షుల్ కాంబోజ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టారు.

# చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా



**వెటరన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో సీఎస్‌కే తరఫున ఆల్‌టైమ్ లీడింగ్ వికెట్ టేకర్‌గా అవతరించాడు. ఐపీఎల్ 2025లో భాగంగా కేకేఆర్‌తో ఇవాళ (మే 7) జరుగుతున్న మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో తన కోటా 4 ఓవర్లు వేసిన జడేజా కీలకమైన రహానే వికెట్ తీశాడు. సీఎస్‌కే తరఫున లీడింగ్ వికెట్ టేకర్‌గా అవతరించే క్రమంలో జడేజా డ్వేన్ బ్రావోను అధిగమించాడు. ఐపీఎల్‌లో జడేజా సీఎస్‌కే తరఫున 184 మ్యాచ్‌ల్లో 141 వికెట్లు సాధించగా.. బ్రావో 116 మ్యాచ్‌ల్లో 140 వికెట్లు తీశాడు.**

**ఐపీఎల్‌లో సీఎస్‌కే తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు..**

**141* - రవీంద్ర జడేజా (184 మ్యాచ్‌లు)**
**140 - డ్వేన్ బ్రావో (116 మ్యాచ్‌లు)**
**95 - ఆర్ అశ్విన్ (104 మ్యాచ్‌లు)**
**76 - దీపక్ చాహర్ (76 మ్యాచ్‌లు)**
**76 - ఆల్బీ మోర్కెల్ (78 మ్యాచ్‌లు)**
**60 - శార్దూల్ ఠాకూర్ (57 మ్యాచ్‌లు)**
**58 - మోహిత్ శర్మ (48 మ్యాచ్‌లు)**

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నామ మాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. నూర్ అహ్మద్ 4 వికెట్లు తీసి కేకేఆర్‌ను దెబ్బేశాడు. అన్షుల్ కంబోజ్, జడేజా తలో వికెట్ తీశారు. కేకేఆర్ ఇన్నింగ్స్‌లో రహానే (48), మనీశ్ పాండే (36 నాటౌట్), రసెల్ (38) ఓ మోస్తరు స్కోర్లు చేయగా.. సునీల్ నరైన్ 26, గుర్బాజ్ 11, రఘువంశీ 1, రింకూ సింగ్ 9 పరుగులు చేసి ఔటయ్యారు.

కాగా, ఈ సీజన్‌లో సీఎస్‌కే కథ ముగిసిన విషయం తెలిసిందే. ఆ జట్టు ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో ఆడిన 11 మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించింది.

కేకేఆర్ విషయానికొస్తే.. ఈ జట్టు ప్లే ఆఫ్స్ బెర్త్ కోసం ఇంకా పోటీలో ఉంది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో 11 పాయింట్లు సాధించింది. ఓ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఓ పాయింట్ వచ్చింది. కేకేఆర్ ఈ మ్యాచ్‌తో కలుపుకుని ఆడాల్సిన మూడు మ్యాచ్‌ల్లో గెలిస్తే ప్లే ఆఫ్స్ రేసులో ఉంటుంది.

# టెస్టుల్లో ఇక రో'హిట్'ను చూడలేం..

## ఆ కల నెరవేరకుండానే రిటైర్మెంట్

**ఐపీఎల్ మ్యాచ్‌లతో ఎంజాయ్ చేస్తున్న అభిమానులకు టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ షాకింగ్ న్యూస్ చెప్పాడు.**



ఐపీఎల్ మ్యాచ్‌లతో ఎంజాయ్ చేస్తున్న అభిమానులకు టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ షాకింగ్ న్యూస్ చెప్పాడు. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు వెల్లడించాడు. వచ్చే నెలలో ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న వేళ హిట్‌మ్యాన్ ఈ కీలక ప్రకటన చేశాడు. రోహిత్ టెస్టు కెరీర్ తక్కువ కాలమే కొనసాగినప్పటికీ అతనికి ఈ ఫార్మాట్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఏడేళ్ల తర్వాత రోహిత్ సుదీర్ఘ ఫార్మాట్‌లోకి అరంగేట్రం చేశాడు. గాయాల బారినపడటం వల్ల టెస్టుల్లోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చాడు. 2013లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌తో టెస్టుల్లోకి అడుగుపెట్టిన హిట్‌మ్యాన్.. తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. టాపార్డర్ విఫలమైన వేళ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 177 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కెరీర్ ఆరంభంలో మిడిల్ ఆర్డర్‌లో ఆడిన రోహిత్.. 2019లో ఓపెనర్‌గా ప్రమోట్ అయ్యాడు. మంచి శుభారంభాలు అందిస్తూ జట్టులో తన స్థానం సుస్థిరం చేసుకున్నాడు. 2022లో విరాట్ కోహ్లీ టెస్టు కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో జట్టు పగ్గాలను రోహిత్ అందుకున్నాడు. 202123 డబ్ల్యూటీసీలో టీమ్ఇండియాను ఫైనల్ వరకు తీసుకెళ్లినా ఛాంపియన్‌గా మాత్రం నిలపలేకపోయాడు. రోహిత్ సారథ్యంలో టీమ్ఇండియా 24 టెస్టులు ఆడగా.. 12 మ్యాచ్‌లు విజయం సాధించి తొమ్మిది మ్యాచ్‌ల్లో ఓడింది. మూడు డ్రా అయ్యాయి. అలవోకగా సిక్సర్లు బాదే ఈ ముంబయి ఆటగాడికి టెస్టుల్లో మంచి రికార్డు ఉంది. వీరేంద్ర సెహ్వాగ్ (90 సిక్స్‌లు, 103 మ్యాచ్‌లు) తర్వాత టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు బాదిన భారత ఆటగాడు రోహితే. 68 మ్యాచ్‌ల్లోనే 88 సిక్సర్లు బాదాడు. ఇక, టెస్టుల్లో రో'హిట్'ను చూడలేమని అభిమానులు నిరాశకు లోనవుతున్నారు. ఇక, హిట్‌మ్యాన్ మెరుపులను మనం వన్డేల్లోనే చూస్తాం. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలు (టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ) సాధించిన రోహిత్.. డబ్ల్యూటీసీ టైటిల్ సాధించాలనే కలను మాత్రం నెరవేర్చుకోలేకపోయాడు.

# పడిక్కల్‌కు ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించిన ఆర్సీబీ



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ 11 మ్యాచ్‌ల్లో 8 విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతూ, ప్లే ఆఫ్స్ బెర్త్‌కు అతి సమీపంలో ఉంది. ఈ సీజన్‌లో ఆర్సీబీ ప్లే ఆఫ్స్‌కు ముందు మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. వీటిలో ఒక్క మ్యాచ్ గెలిచినా ఆ జట్టు ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది. ఆర్సీబీ తమ తదుపరి మ్యాచ్‌ల్లో లక్నో (మే 9), సన్‌రైజర్స్ (మే 13), కేకేఆర్‌లతో (మే 17) తలపడనుంది.

కాగా, ఆర్సీబీకి సీఎస్‌కేతో ఆడిన గత మ్యాచ్‌లో ఓ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు వన్‌డౌన్ ఆటగాడు, ఇన్‌ఫామ్ ప్లేయర్ దేవ్‌దత్ పడిక్కల్ గాయపడ్డాడు. తాజాగా ఆర్సీబీ యాజమాన్యం పడిక్కల్ స్థానాన్ని భర్తీ చేసింది. పడిక్కల్‌కు ప్రత్యామ్నాయ ఆటగాడిగా మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేసింది. మయాంక్‌ను ఆర్సీబీ కోటి రూపాయలకు దక్కించుకుంది.

34 ఏళ్ల మయాంక్‌కు ఐపీఎల్‌లో మంచి ట్రాక్ రికార్డు ఉంది. 2011 నుంచి అతను వివిధ ఫ్రాంచైజీల తరఫున 127 మ్యాచ్‌లు ఆడి 2661 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గత సీజన్‌లో మయాంక్ సన్‌రైజర్స్‌లో ఉన్నాడు. ఈ సీజన్ మెగా వేలంలో మయాంక్‌ను ఏ జట్టు కొనుగోలు చేయలేదు.

తమ తొలి టైటిల్ వేటను విజయవంతంగా సాగిస్తున్న ఆర్సీబీకి మున్ముందు ఆడబోయే కీలక మ్యాచ్‌ల్లో మయాంక్ ఏ మేరకు తోడ్పడతాడో చూడాలి. మయాంక్‌కు గతంలో (2011) ఆర్సీబీకి ఆడిన అనుభవం ఉంది. మయాంక్ స్వస్థలం బెంగళూరే కావడం అతనికి కలిసొచ్చే అంశం. మయాంక్ దేవ్ స్థానాన్ని భర్తీ చేయగలడో లేదో చూడాలి. దేవ్ ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడి 247 పరుగులు చేశాడు.

హ్యారీ బ్రూక్‌కు ప్రత్యామ్నాయంగా అటల్
లీగ్ ప్రారంభానికి ముందు వైదొలిగిన హ్యారీ బ్రూక్ స్థానాన్ని ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు సెదిఖుల్లా అటల్‌తో భర్తీ చేసింది ఢిల్లీ క్యాపిటల్స్. ఢిల్లీ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. ఈ జట్టు ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించి 13 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులో కొనసాగుతుంది.



# రికార్డుల్లోకెక్కిన రహానే

**ఐపీఎల్ 2025లో భాగంగా కేకేఆర్, సీఎస్‌కే మధ్య ఇవాళ (మే 7) జరుగుతున్న మ్యాచ్‌లో అజింక్య రహానే ఓ అరుదైన మైలురాయిని తాకాడు. ఈ మ్యాచ్‌లో 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 48 పరుగులు చేసి ఔటైన రహానే.. ఐపీఎల్‌లో 5000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. తద్వారా క్యాష్ రిచ్ లీగ్‌లో ఈ ఘనత సాధించిన ఏడో భారత ఆటగాడిగా, ఓవరాల్‌గా తొమ్మిదో ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు.**

రహానే తన 197 ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించాడు. రహానేకు ముందు విరాట్ కోహ్లీ (8509), రోహిత్ శర్మ (6928), శిఖర్ ధవన్ (6769), డేవిడ్ వార్నర్ (6565), సురేశ్ రైనా (5528), ఎంఎస్ ధోని (5406), ఏబీ డివిలియర్స్ (5162), కేఎల్ రాహుల్ (5064) ఐపీఎల్‌లో 5000 పరుగుల మార్కును అధిగమించారు.

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేస్తున్న కేకేఆర్ 15 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. రహ్మానుల్లా గుర్బాజ్ 11, సునీల్ నరైన్ 26, రహానే 48, రఘువంశీ 1 పరుగు చేసి ఔట్ కాగా.. రసెల్ 17, రసెల్ 18 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్ 2, అన్షుల్ కంబోజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీశారు. కాగా, ఈ మ్యాచ్ కోసం కేకేఆర్ ఓ మార్పు చేసింది. వెంకటేశ్ అయ్యర్ స్థానంలో మనీశ్ పాండే తుది జట్టులోకి వచ్చాడు. మరోవైపు సీఎస్‌కే ఈ మ్యాచ్‌లో ప్రయోగాల బాట పట్టింది. ఉర్విల్ పటేల్, డెవాన్ కాన్వే, అశ్విన్ తుది జట్టులోకి వచ్చారు.

ఈ సీజన్‌లో సీఎస్‌కే కథ ముగిసిన విషయం తెలిసిందే. ఆ జట్టు ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో ఆడిన 11 మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించింది.

కేకేఆర్ విషయానికొస్తే.. ఈ జట్టు ప్లే ఆఫ్స్ బెర్త్ కోసం ఇంకా పోటీలో ఉంది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో 11 పాయింట్లు సాధించింది. ఓ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఓ పాయింట్ వచ్చింది. కేకేఆర్ ఈ మ్యాచ్‌తో కలుపుకుని ఆడాల్సిన మూడు మ్యాచ్‌ల్లో గెలిస్తే ప్లే ఆఫ్స్ రేసులో ఉంటుంది.

**తుది జట్లు..**

**కోల్‌కతా నైట్ రైడర్స్ (ప్లేయింగ్ XI):**
రహ్మానుల్లా గుర్బాజ్(w), సునీల్ నరైన్, అజింక్యా రహానే(c), అంగ్క్రిష్ రఘువంశీ, మనీష్ పాండే, ఆండ్రీ రస్సెల్, రింకు సింగ్, మొయిన్ అలీ, రమణదీప్ సింగ్, వైభవ్ అరోరా, వరుణ్ చకరవర్తి



**చెన్నై సూపర్ కింగ్స్ (ప్లేయింగ్ XI):**
ఆయుష్ మ్హాత్రే, ఉర్విల్ పటేల్, డెవాన్ కాన్వే, రవీంద్ర జడేజా, డెవాల్డ్ బ్రీవిస్, రవిచంద్రన్ అశ్విన్, MS ధోని(w/c), అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్, మతీషా పతిరానా